
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం। 26। డిసెంబర్। 2023



రూ.25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ
పేదల పాలిట వరంగా మారిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులో సరికొత్త ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. 8లో




పుస్తకాలే ప్రపంచం 8లో
ప్రభుత్వ కొలువు సాధించాలనే దృఢ సంకల్పంతో పలువురు యువకులు వర్సిటీని వేదికగా చేసుకుని నిత్యం పరిశ్రమిస్తున్నారు.



శ్రీరాముడిగా అప్పన్న 8లో
సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రామ అలంకరణలో దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

నిరుపేద యువకుడికి ఎస్‌ఐ కొలువు



అమ్మమ్మతో ఎస్‌ఐగా ఎంపికైన షేక్ జిలాని

సీలేరు: నిరుపేద కుటుంబంలో పుట్టిన షేక్ జిలాని ఎస్‌ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. సీలేరు గ్రామానికి చెందిన షేక్ జిలాని చిన్నతనంలో తల్లి చనిపోయింది. అమ్మమ్మ షేక్ లాల్బీ వద్ద కుమారుడిని వదిలేసి తండ్రి కాకినాడ వెళ్లిపోయాడు. సీలేరులో పదవ తరగతి వరకు, ఇంటర్, డిగ్రీని నాగార్జున సాగర్‌లోని ఏపీఆర్‌జేసీలో చదివాడు. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా ఇంటివద్దే ఉండి చదువుతూ ఎస్‌ఐ పరీక్షలు రాశాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. జిలానీని గ్రామస్తులు అభినందించారు.

ఆలస్యంగా బయల్దేరిన విశాఖపట్నం-తిరుపతి స్పెషల్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం-తిరుపతి(08583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 8.20 గంటలకు బయల్దేరింది. లింక్ రైలు రాక ఆలస్యం కారణంగా ఈ రైలు ఆలస్యంగా బయల్దేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కేజీహెచ్‌లో 11 వాటర్ కూలర్ల ఏర్పాటు



రోగుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్లు

మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్‌లో 11 వాటర్ కూలర్లను ఏర్పాటు చేశారు. కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిధులు రూ.30 లక్షలతో కేజీహెచ్‌లో వీటిని ఏర్పాటు చేశారు. సోమవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు డీపీ నాయుడు, డీఈఈ మన్మథరావు తదితరులు వీటిని పరిశీలించారు.

కరోనా రోగులకు చికిత్స



ఐసోలేషన్ వార్డు

మహారాణిపేట(విశాఖ): కరోనా సోకిన ఇద్దరు రోగులు కేజీహెచ్ ఐసోలేషన్‌వార్డులో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ తెలిపారు. కైలాసపురానికి చెందిన 51 ఏళ్ల మహిళ వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో ప్రభుత్వ ఛాతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమెకు కరోనా పాజిటివ్ రావడంతో కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఇంతవరకు కరోనా సోకిన వారి సంఖ్య 18కి చేరిందని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఆదివారం తీసిన శాంపిల్స్ ఇంకా పరీక్షించలేదన్నారు.

ఐఎన్‌ఎస్ ఘూరియల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లు



ఎన్‌సీసీ క్యాడెట్లకు నౌకలో ఫైర్‌ఫైటింగ్‌పై శిక్షణ ఇస్తున్న నేవీ సిబ్బంది

విశాఖ సిటీ: రెండు వారాల సముద్ర శిక్షణలో భాగంగా దేశంలో ఉన్న 59 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు ఐఎన్‌ఎస్ ఘూరియల్ నౌకలో నేవీ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఇందులో సెయిలింగ్, ఫైర్ ఫైటింగ్, డ్యామేజ్ కంట్రోల్, చిన్న ఆయుధాలపై శిక్షణ అందించారు. అలాగే నేవల్ డాక్‌యార్డ్‌ను, అందులో పలు నౌకలను సందర్శించారు. నావికాదళ కార్యకలాపాలను తెలుసుకున్నారు.

ఆటకు సై



ఆడుదాం ఆంధ్రా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారులు (ఫైల్)



క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు (ఫైల్)

- క్రీడా సంబరాలకు సర్వం సిద్ధం
- నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు
- తొలుత గ్రామ స్థాయిలో ..
- ఇప్పటికే క్రీడాకారుల రిజిస్ట్రేషన్ పూర్తి
- అందుబాటులో క్రీడా పరికరాలు

పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలను ఫిబ్రవరి 10 వరకు సుమారు 47రోజుల పాటు ఐదు దశల్లో పండగ వాతావరణంలో నిర్వహించనున్నారు.

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారికి తోడ్పాటు అందించి మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తోంది. క్రీడాకారులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు సంబంధించిన క్రీడా కిట్లను ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా గ్రామ సచివాలయాలకు అందజేశారు. క్రీడల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ ప్రత్యేక జూమ్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి డీఈవో, డీఎంహెచ్‌వో, ఎంపీడీవోలు, ఎంఈవోలు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులకు క్రీడా పోటీలు ప్రారంభించేందుకు ఆహ్వానాలు కూడా అందజేశారు. మండలస్థాయిలో విజయం సాధించిన జట్లకు టీ షర్టులు, క్యాప్‌లు అందజేయనున్నారు. ఒక్కో గ్రామ సచివాలయానికి 114 టీషర్టులు, 114 క్యాప్‌లు సరఫరా చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 352 గ్రామసచివాలయాలకు 40,128 క్యాప్‌లు, అదే సంఖ్యలో టీషర్టులు అందజేయనున్నారు. ఐదు క్రీడలకు సంబంధించి 44,249 మంది పురుషులు, 4419 మంది స్త్రీలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అన్ని క్రీడలకు 4,587 పురుషుల టీంలు, 2,354 మహిళల టీంలను ఏర్పాటు చేశారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 338 క్రీడా మైదానాలను సిద్ధం చేశారు.

మండలాలు : 22
గ్రామ సచివాలయాలు : 352
క్రీడా మైదానాలు : 338

రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు
పురుషులు : 44,249 మంది
స్త్రీలు : 4,419 మంది

ఏర్పాటు చేసిన టీంలు
పురుషులు -4,587
స్త్రీలు-2,354

క్రీడా కిట్ల వివరాలు
క్రికెట్ : పురుషులకు 748 కిట్లు
స్త్రీలకు 374 కిట్లు
వాలీబాల్ కిట్లు : 1,144
షటిల్ బ్యాడ్మింటన్ : 2,288
కబడ్డీ నీకప్స్ : 620
ఖో-ఖో యాంకిల్ క్యాప్స్ : 620

క్రీడాపోటీల నిర్వహణ తేదీలు

గ్రామ స్థాయి : డిసెంబర్ 26 నుంచి జనవరి 9 వరకు
మండల స్థాయి : జనవరి 10 నుంచి జనవరి 23 వరకు
నియోజకవర్గ స్థాయి : జనవరి 24 నుంచి జనవరి 30 వరకు
జిల్లా స్థాయి : జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5వరకు
రాష్ట్ర స్థాయి : ఫిబ్రవరి 6న నిర్వహిస్తారు.

పకడ్బందీగా నిర్వహణ



రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గ్రామ నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహిస్తున్నాం. గ్రామ, మండల స్థాయిల్లో పోటీలను ప్రారంభించేందుకు ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు అందజేశాం. ఎటువంటి వివాదాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా ఈ పోటీలను నిర్వహించనున్నాం. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి, తమలో దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించాలి.

– జగన్‌మోహన్‌రావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, క్రీడా ప్రాధికార సంస్థ, అల్లూరి జిల్లా, పాడేరు.

ఆనందోత్సాహాలతో క్రిస్మస్ వేడుకలు



పాడేరు ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పాడేరు : కరుణామయుడైన ఏసుక్రీస్తు బాలయేసుగా భూమిపై అవతరించిన వేళ.. విశ్వాసుల హృదయాల భక్తిభావంతో నిండిపోయాయి. స్టార్లు కాంతులీనాయి. క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. క్రైస్తవులందరూ ఉత్సాహంగా గడిపారు. విద్యుత్ దీపాల అలంకరణతో చర్చిలన్నీ శోభిల్లాయి. క్రిస్మస్ సందర్భంగా భక్తులందరూ సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చర్చిలకే పరిమితమయ్యారు. నూతన దుస్తులు ధరించి హ్యాపీ క్రిస్మస్.. మేర్రీ క్రిస్మస్ అంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిలన్నీ విశ్వాసులతో కిటకిటలాడాయి. పాస్టర్లు దైవ సందేశం వినిపించారు. ఏసు మార్గంలో నడవాలని సూచించారు. క్రీస్తు మార్గమే మానవాళికి శరణ్యమని చెప్పారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు క్రీస్తు గీతాలను ఆలపించారు. జిల్లాలోని పలు చర్చిల్లో క్రిస్మస్ కేకలు కట్ చేశారు.



గుంటగన్నెల చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న దైవజనులు



జీకే పాడు లూథరన్ చర్చిలో క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న మహిళలు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్ : గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. పట్టణంలోని తలార్‌సింగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఐదు క్రీడా అంశాలలో 47 రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద మెగా ఈవెంట్ నిర్వహించడం ఇదే తొలిసారి అని చెప్పారు. క్రీడా సంబరాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 1,22,13,094 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం చారిత్రాత్మకమన్నారు. క్రీడాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో మెలగాలన్నారు. పోటీలను స్నేహ పూర్వక వాతావరణంలో జరిగేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఎ. జగన్‌మోహన్‌రావు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కుంతూరు నర్సింహమూర్తి, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, కిముడు రాంబాబు, గ్రామ వలంటీర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాచేరు డైవర్షన్ రోడ్డుపై రాకపోకలకు అనుమతి



పేటలో తాచేరు డైవర్షన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ



డైవర్షన్ రోడ్డుపై నుంచి వస్తున్న పాదచారులు

పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట(అనకాపల్లి జిల్లా): బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద డైవర్షన్ రోడ్డు మీదుగా రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 18న భీమునిపట్నం, నర్సీపట్నం రోడ్డులో విజయరామరాజుపేట వద్ద బ్రిటిష్ కాలం నాటి తాచేరు వంతెన కూలిపోయిన విషయం తెలిసిందే. దీంతో విశాఖ, అనకాపల్లి, పాడేరు, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల తదితర రహదారుల్లో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో డైవర్షన్ రోడ్డు ఏర్పాటు, వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.5 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ డీఈ రమేష్‌ను విప్ ధర్మశ్రీ ఆదేశించారు. ముందుగా ఆర్‌అండ్‌బీ అధికార్లు డైవర్షన్ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. డైవర్షన్ రోడ్డును మండల నాయకులతో కలిసి విప్ ధర్మశ్రీ సోమవారం పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా రాకపోకలు సాగేలా చూడాలని ఆర్‌అండ్‌బీ అధికారులను, పోలీసులను సూచించారు.

మరోవైపు వంతెన నిర్మాణ పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నుంచి డైవర్షన్ రోడ్డు మీదుగా పాదచారుల రాకపోకలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి వాహనాలను అనుమతిస్తారు. ధర్మశ్రీ వెంట జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ విజయ్‌కుమార్, కోఆపరేటివ్ అధ్యక్షుడు గోవింద తదితర్లు ఉన్నారు.

సందడిగా పర్యాటక కేంద్రాలు



సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద పాల సముద్రాన్ని తలపిస్తున్న మేఘాలు



చాపరాయి వద్ద సందర్శకులు

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ/అనంతగిరి: జిల్లాలో పర్యాటక కేంద్రాలకు సోమవారం సందర్శకులు పోటెత్తారు. అరకులోయ సమీపంలో గల మాడగడ సన్ రైజ్ వ్యూపాయింట్‌కు పర్యాటకుల తాకిడి భారీగా పెరిగింది. కుటుంబ సమేతంగా సందర్శకులు వచ్చి సందడి చేశారు. ఇక్కడ ట్రాఫిక్ జామ్ అవడంతో కిలోమీటరు మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

- డుంబ్రిగుడ మండలం చాపరాయి జలపాతానికి భారీగా సందర్శకులు వచ్చారు. ఉల్లాసంగా జలకాలాడారు. అరకు-పాడేరు ప్రధాన మార్గంలో ఉన్న పొద్దుతిరుగుడు పూల తోటల్లో ఫొటోలు తీసుకున్నారు.
- అనంతగిరి మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు పర్యాటకులతో సందడిగా మారాయి. బొర్రాగుహలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గేటువలస నుంచి బొర్రా వరకు రోడ్డు పర్యాటకుల వాహనాలతో రద్దీగా మారింది. మూడు రోజులుగా టూరిస్ట్‌స్పాట్లన్నీ కళకళలాడుతున్నాయి. సోమవారం బొర్రాకు 10,800 మంది పర్యాటకులువచ్చారని, ఆదాయం రూ.8.39 లక్షలు లభించినట్టు బొర్రా యూనిట్ మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు.

పాపికొండలకు పర్యాటకుల తాకిడి

14 బోట్లలో వేయి మంది తరలింపు

వీఆర్‌పురం: క్రిస్మస్ సెలవులతో పాపికొండలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. సోమవారం పోచవరం బోటు పాయింట్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో 20 రోజుల పాటు అధికారుల ఆదేశాల మేరకు బోటింగ్‌ను నిలిపివేశారు. కాగా గత వారం అధికారులు తిరిగి అనుమతినిచ్చారు. అయినా పర్యాటకులు అంతంతమాత్రంగానే ఉన్నారు. ఆది, సోమవారాలు సెలవు కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 14 బోట్లలో వెయ్యిమందికి పైగా పర్యాటకులు పాపికొండల సందర్శనకు వెళ్లినట్టు ఏపీటూరిజం కౌంటర్ అసిస్టెంట్ సీహెచ్.రాజేష్ తెలిపారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బోటింగ్ పాయింట్ ,పేరంటాలపల్లి శివాలయం ప్రాంతాలు కళకళలాడాయి.



పేరంటాలపల్లి రేవు వద్ద పర్యాటకులు

నేడు విశాఖకు గవర్నర్ రాక



మహారాణిపేట(విశాఖ): ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం విశాఖ వస్తున్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి 11.35 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. రైల్వే స్టేషన్ నుంచి గవర్నర్ నేరుగా నోవొటెల్ హోటల్‌కు వెళతారు. బుధవారం కూడా అదే హోటల్‌లో బస చేస్తారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి నేరుగా నోవొటెల్ హోటల్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వెళతారు.

అన్ని రంగాల అభివృద్ధికి విశాఖ అనుకూలం

- ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- ముగిసిన క్రెడాయ్ ఎక్స్‌పో




క్రెడాయ్ ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఆరిలోవ(విశాఖ): విశాఖ నగరంలో అన్ని రంగాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పరిశ్రమలు, ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఎంవీపీ కాలనీలో గాదిరాజు ప్యాలస్‌లో మూడు రోజులు పాటు నిర్వహించిన క్రెడాయ్ ఎక్స్‌పో షో సోమవారం ముగిసింది.

రియల్ ఎస్టేట్, బ్యాంకులు, ఇంటీరియల్ మెటీరియల్ తదితర వాటికి సంబంధించిన 96 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ఇళ్లను అందించడంలో క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ కృషి చేస్తోందన్నారు. ఏయూలో ఆర్కిటెక్చర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సలాది సౌమ్య, సోవిత్ ఖడ్కా, జగదీష్ రెడ్డిలకు బీఆర్ రాజు స్మారక అవార్డులను మంత్రి అమర్‌నాథ్ అందజేశారు. దీంతో పాటు వినియోగదారులకు లక్కీడిప్ నిర్వహించారు. విజేతలకు 5 గ్రాములు బంగారు నాణేలను అందజేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు ధర్మేందర్, కేఎస్ఆర్‌కే రాజు, వి.శ్రీను పాల్గొన్నారు.

పుస్తకాలే ప్రపంచం

- గ్రూప్ 2కి సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- వర్సిటీ పరిసరాల్లో విద్యార్థుల సాధన
- చలిలోనూ..వీధి దీపాల మధ్య చదువులు



ఫోన్‌లో మాక్ టెస్ట్ రాస్తున్న విద్యార్థి




స్నాతకోత్సవ మందిరం కారిడార్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: వారు అక్షర నేస్తాలు...పుస్తక ప్రియులు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన అధికశాతం మంది నిత్యం అక్కడ పుస్తకాలతో మనకు దర్శనమిస్తుంటారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం, స్నాతకోత్సవ మందిరం, ఆర్ట్స్ కళాశాల పరిసర ప్రాంతాల్లో వీధిదీపాల వద్ద చదువుకుంటూ మనకు కనిపిస్తారు. ప్రభుత్వ కొలువు సాధించాలనే దృఢ సంకల్పంతో వీరు వర్సిటీని వేదికగా చేసుకుని తమ లక్ష్య సాధన కోసం నిత్యం పరిశ్రమిస్తున్నారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రూ -2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫిబ్రవరిలో దీనికి సంబంధించిన పరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు వీటికి దరఖాస్తు చేసుకున్నారు. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో మొత్తం 899 ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. వీటిని సాధించాలనే లక్ష్యంతో వర్సిటీ ప్రాంగణంలో పదుల సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పుస్తకాలే ప్రపంచంగా గడుపుతున్నారు.

రోజూ ఒక నిర్దిష్ట ప్రణాళికను సిద్ధం చేసుకుని, సమయం వృథా కాకుండా వీరు పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. ఆధునికత సాంకేతికతను సైతం వీరు అందిపుచ్చుకుంటున్నారు. గ్రూప్ 2 పరీక్షకు సిద్ధమవుతూ నిత్యం ఒక నమూనా పరీక్ష (మాక్ టెస్ట్)కు సైతం హాజరవుతున్నారు. తమ సెల్‌ఫోన్‌లోనే ప్రత్యేకంగా రుసుము చెల్లించి నిత్యం మాక్ టెస్ట్‌లతో తమ జ్ఞానాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆన్‌లైన్ యాప్‌లకు మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది కాలానికి ప్రత్యేక రుసుము చెల్లించి పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నాయి. మరికొంత మంది ఆన్‌లైన్‌లో నిపుణులు పాఠాలు, సబ్జెక్ట్ నిపుణుల ప్రసంగాలు వింటూ కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. మరికొంత మంది పుస్తకాల్లో ముఖ్యమైన అంశాలను చదివిన వెంటనే నోట్స్ రూపంలో రాసుకుంటున్నారు. ప్రముఖ సంస్థలు ప్రచురించిన స్టడీ మెటీరియల్స్‌ను సైతం స్నేహితుల నుంచి సంగ్రహించుకుని చదువుకుంటున్నారు.

వర్సిటీలో ప్రస్తుతం పీజీ కోర్సులు చేస్తున్న విద్యార్థులతో పాటు, ఇప్పటికే పీజీ, బీఈడీ వంటి కోర్సుల్లో ఏయూలో పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సైతం గ్రూప్ 2 పరీక్షలకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కొంతమంది ప్రైవేటు హాస్టల్స్‌లో ఉంటూ, మరి కొంత మంది స్నేహితులతో కలిసి ఇళ్లు అద్దెకు తీసుకుని చదువుకుంటున్నా రు. నెలకు రూ.5 వేల వరకు అద్దెకు, భోజనానికి వెచ్చిస్తూ పరీక్షల కోసం నిత్యం వర్సిటీలో ప్రశాంత వాతావరణంలో చదువుకుంటూ తమ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. సోమవారం క్రిస్మస్ రోజున సైతం రాత్రి చలిలో వీరు పుస్తకాలను వదలకుండా చదువుకుంటూ కనిపించారు. పండుగలు, స్నేహితులు, ఫంక్షన్లు ఇలా అన్నీ పక్కన పెట్టి కేవలం ఉద్యోగం పొందడం లక్ష్యంగా సాధన చేస్తున్నారు.



తదేక దీక్షతో..

క్లుప్తంగా

వ్యాన్-ద్విచక్ర వాహనం ఢీ

ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ బాధితులు

చింతపల్లి రూరల్: వ్యాన్-ద్విచక్రవాహనం ఢీకొట్టి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన చింతపల్లి మండలం పెద్దగడ్డ మలుపు వద్ద చోటు చేసుకుంది. జాజులపాలేనికి చెందిన పాంగి రాము, పాంగి సుధాకర్, మర్రి మధు చింతపల్లి నుంచి తమ స్వగ్రామం వెళ్తున్నారు. నర్సీపట్నం నుంచి అటుగా వస్తున్న వ్యాన్‌ని బలంగా ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపైన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా, డాక్టర్ రుక్మిణి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేసినట్టు ఆమె తెలిపారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

అనకాపల్లి: ఒడిశా రాష్ట్రం నయాగడ్ నుంచి కర్ణాటక రాష్ట్రం బెంగుళూర్ రుక్సాన్ మార్కెట్‌కు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ వి.సుబ్బరాజు చెప్పారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణకు అందిన సమాచారం మేరకు బైపాస్‌రోడ్డు నూకాంబిక ఆర్చి వద్ద వాహనాలు తనిఖీ చేయగా, అదే దారిలో వెళుతున్న మ్యాక్సీవ్యాన్‌లో రూ.2.39 లక్షల విలువగల 83 కిలోల గంజాయి బస్తాలు బయటపడ్డాయని డీఎస్పీ తెలిపారు. గంజాయితో పాటు ఒడిశా రాష్ట్రం నయాగడ్ జిల్లా గోష్ఠంది గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ పరిద, డ్రైవర్ బిహరి కిశోర్‌ను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రెండు ఫోన్‌లు, వ్యాన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను 11వ అడిషనల్ న్యాయమూర్తి ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ చెప్పారు. ఇన్‌చార్జి సీఐ ఎ.రవికుమార్, ఎస్ఐలు సింహాచలం పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఉపమాక వెంకన్న తిరువీధి

నక్కపల్లి : మండలంలో ఉపమాకగ్రామంలో గరుడాద్రి పర్వతనంపై స్వయంవ్యక్తంగా వేంచేసి ఉన్న శ్రీ కల్కివెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు సందర్భంగా సోమవారం స్వామివారు అశ్వవాహనంపై తిరువీధిసేవ నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు సంకర్షణపల్లి గోపాలకృష్ణమాచార్యులు అభిషేకాలు నిర్వహించారు. కొండ దిగువున గల ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామివారి ఆలయంలో ఉపాలయాల్లో నిత్య కార్యక్రమాలు యధావిధిగా జరిగాయి. అంతకుముంతు తిరుప్పళ్లియెళైచ్చి తిరుప్పావై సేవాకాలం, స్వామివారి ఉత్సవమూర్తులకు నీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్ఠి, అశ్వవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను, గోదాదేవి అమ్మవారి పల్లకీలో అధిష్ఠింప చేసి గ్రామంలో తిరువీధిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు, నందూరి వెంకటరాజగోపాలాచార్యులు, ఇల్లింద వెంకట గోపాలాచార్యులు, నండూరి వెంకట అప్పలరంగాచార్యులు, దేవస్థానం సిబ్బంది గురవయ్య, గ్రామానికి చెందిన రేజేటి సింగరాచార్యులు, యు.వి.రంనాథస్వామి, భక్తులు పాల్గొన్నారు.



అశ్వవాహనంపై స్వామివారి తిరువీధి సేవ అర్చకులు, భక్తులు

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయండి



హుకుంపేటలోని పార్టీ శ్రేణులతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: అరకు నియోజకవర్గంలోని హుకుంపేట మండల కేంద్రం వేదికగా ఈ నెల 29న నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్రను నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండల కేంద్రంలోని సోమవారం ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతానికి సంబంధిత నాయకులు కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు సమష్టిగా పని చేసి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, పార్టీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్,మండల అధ్యాక్షుడు గెమ్మెలి కొండబాబు,విధ్యార్థి విభాగం రాష్ట్రా కార్యదర్శి భూషణ్, జిల్లా కల్చరల్ విభాగ అధ్యక్షుడు దిలిప్‌కుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సింహాచలం, జేసీఎస్ మండల రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ధర్మయ్యదొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాముడిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అదిష్ఠింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం , కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు శ్రీకాంతాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జియ్యంపాలెం సర్పంచ్ అంత్యక్రియలు

గంగవరం : రోడ్డు ప్రమాదంలో మరణించిన జియ్యంపాలెం సర్పంచ్ కంగల సుబ్బలక్ష్మి అంత్యక్రియలు జియ్యంపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, సూరంపాలెం ఎంపీటీసీ సభ్యురాలు కుంజం పద్మావతి, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్దార్థ పలువురు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను పలువురు కలసి సంతాపం తెలియజేశారు.

రూ.25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ

- పేదల ఆరోగ్యానికి భరోసా
- 4.5 లక్షల స్మార్ట్ కార్డుల పంపిణీకి శ్రీకారం



మహారాణిపేట : పేదల పాలిట వరంగా మారిన ఆరోగ్యశ్రీలో సరికొత్త ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. పేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇచ్చే ఆరోగ్యశ్రీ పరిధిని ప్రభుత్వం విస్తరించింది. కుటుంబానికి రూ.25 లక్షల విలువ గల ఆరోగ్య సేవలు అందించడానికి ప్రణాళిక రూపొందించింది. ఆరోగ్యశ్రీలో వ్యాధుల సంఖ్య పెంచడంతోపాటు క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా చేర్చిన విషయం తెలిసిందే. పేద ప్రజలకు 3,257 రోగాలకు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందుతోంది. ఆరోగ్యశ్రీ కార్డుంటే రూ.25 లక్షల వైద్యం మనచేతిలో ఉన్నట్టే. ఇప్పటికే కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీకి కూడా శ్రీకారం చుట్టింది. స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారు. 1,059 వ్యాధులతో శ్రీకారం చుట్టారు. ఈ తర్వాత దశల వారీగా వ్యాధుల సంఖ్య పెంచారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన చంద్రబాబు ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారు. ఆ తర్వాత అఖండ మెజార్టీతో అధికారం చేపట్టిన వైఎస్ తనయుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ఆరోగ్యశ్రీకి ప్రాణం పోశారు. ఆరోగ్య శ్రీ పథకంలో అనేక దీర్ఘకాలిక రోగాలతోపాటు మొత్తం 3,257 వ్యాధులను చేర్చారు. ప్రస్తుతం సరికొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు పంపిణీకి శ్రీకారం చుట్టారు. మొత్తం జిల్లాలో 4.50 లక్షల కార్డులు ఉన్నాయి. వీటిని దశల వారీగా పంపిణీ చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్ల ద్వారా పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. పదేళ్లయినా భద్రంగా ఉండేలా కార్డును రూపొందించారు. అలాగే కార్డుకు క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. మొబైల్ యాప్ ద్వారా కార్డుదారుడి పూర్తి హెల్త్ రికార్డ్, ఆరోగ్య శ్రీ ద్వారా పొందిన సేవలు, రిపోర్టులు, ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా చూసుకునే విధంగా కార్డు రూపొందించారు. ఆరోగ్యశ్రీ నెట్ వర్కు ఆస్పత్రుల వివరాలు, ఆరోగ్యశ్రీ పరిధిలో ఉండే వ్యాధుల వివరాలు కూడా యాప్‌లో పొందుపరిచారు.

కార్డుల పంపిణీ



ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేస్తున్నాం. మొత్తం 4.50 లక్షల కార్డులు ఉన్నాయి. సచివాలయం పరిధిలో వలంటీర్లు ద్వారా ఈ కార్డులు పంపిణీ జరుగుతోంది. పేదల ప్రజల కోసం ఉద్దేశించిన ఈ ఆరోగ్య శ్రీ పరిధిలోకి తెలుపు కార్డుదారులందరూ వస్తారు. – డాక్టర్ కొటకల రాజేష్ కుమార్, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త, విశాఖజిల్లా

అప్పన్నను దర్శించుకున్న ఐఏఎస్ అధికారి



అప్పన్న సన్నిధిలో మధిమితా బసు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం భారత ప్రభుత్వ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ డైరెక్టర్ మధిమితా బసు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమె పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం అందజేశారు.

కనులపండువగా మార్గశిర మాసోత్సవాలు

కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు

డాబాగార్డెన్స్ (విశాఖ): కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. 12వ రోజు, సోమవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. టౌన్ కొత్తరోడ్డు వరకు క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన చేసి, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనాలు కల్పించారు. 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకాలు, అష్టోత్తర నామార్చన నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.



వెండి కవచంలో అమ్మవారు

- అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో 28 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మప్రచార మాసోత్సవాలు..మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో లలిత డ్యాన్స్ అకాడమీ కళాకారిణి ఎం. లలిత నృత్య ప్రదర్శన అలరించింది. మంగళవారం నగరానికి చెందిన చెల్లపిళ్ల మహర్షి, పాతనగరం రాజప్పనాయుడు వీధి ఆనందకుమార్‌చే బుర్రకథ ఏర్పాటు చేసినట్టు ఈవో శిరీష తెలిపారు.

విమానాశ్రయంలో క్రిస్మస్ సొబగులు



విశాఖ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన డెకరేషన్

గోపాలపట్నం: క్రిస్మస్ సందర్భంగా విశాఖ విమానాశ్రయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విమానాశ్రయం టెర్మినల్ లోపల పూలతో అలంకరించారు. అక్కడ ఏర్పాటుచేసిన క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. విద్యుత్ దీపకాంతులతో విమానాశ్రయ ధగధగ మెరిసిపోయింది. ప్రయాణికులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



టెర్మినల్ లోపల ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

పేకాట శిబిరంపై దాడి

అనకాపల్లి: మండలంలో రేబాక గ్రామంలో పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6,200 నగదును స్వాధీనం తీసుకున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు సోమవారం చెప్పారు. ముందస్తు సమాచారంతో పేకాట శిబిరంపై దాడి చేయడం జరిగిందని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.